# స్వధర్మం

ఎర్రని కంకర దుమ్ము ఎండై మండుతూ లేచింది.

దాహం అంది సుబ్బులు. ఎర్రని కళ్ళతో మగత నిద్రలో నోరు తెరుచుకుని ఆబగా గాలిని తాగుతోంది చిట్టి. ఇద్దరూ విశాలంగా పడుకున్నారు; ప్రయాణికులు దిగిపోయి కింద ప్లాట్ ఫారం మీద తచ్చాడుతున్నారు గనక కూర్చున్న బల్ల ఖాళీ అయింది.

చొక్కా విప్పాడు. లోపలేదో పాకుతుంటే-చేత్తో తడుముకున్నాడు. చెమట పురుగు. జేబులో డబ్బూ కాగితాలూ కిందపడ్డాయి. రైలు పెట్టెలో తీశాడు. డబ్బు జేబులో పెట్టాడు. ఎర్రని రైల్వేపాస్ తడిసింది చెమటకి. కిటికి దగ్గర పట్టుకుని ఆరబెట్టాడు. సిరా కొంచెం అక్షరాలనుంచి వెడల్పుగా

పాకింది. అది చెరిగిపోతే మద్రాసు సెంట్రల్ లో ఏం గొడవపెడతారో!
టి. సి చదివాడు. స్పష్టంగానే ఉన్నాయి అక్షరాలు ఫరవాలేదు.

"సుబ్బారాయుడు—బుకింగ్ క్లార్కు-వైఫ్ సుబ్బలక్ష్మి 42-డాటర్ చిట్టి-5" స్పష్టంగానే ఉన్నాయి అక్షరాలు. ఫ్రీపాస్ కీ పైన దళసరి అక్షరాలలో అచ్చు-సెకండ్ క్లాస్ అంతస్తు పెరిగింది మూడు నుంచి రెండుకి. తనకే కాదు. భారత ప్రజకంతకీ అంతస్తు పెంచేసింది రైల్వే. రెండో తరగతికి.

దాహం—సుబ్బులు ఎండిన ఆత్మ మళ్ళీ అడిగింది.

సీసా చేత పుచ్చుకుదిగాడు.

కుళాయివద్ద గుంపు లెక్కపెట్టాడు. 35 ఆఖరి ఆసామీ యెడల కూడా. కుళాయి కనికరించలేదు. ఎంత నొక్కినా చుక్కరాలకపోడం చూశాడు తను 37వ వాడు "ఏడుకొండల" ఎత్తునించి "వాడు" మోహినీ రూపంలో తనముందువాలి మంచినీళ్ల అమృతం పంచిపెడతాడు. ముందున్న ముప్ఫయ్యారుగురూ దానవులు. అంచేత మోహిని వాళ్లని అనుగ్రహించలేదు మంచినీళ్ళు. తను దేవత కుళాయికూడా అంగుటివాకా అర్చుకుపోయింది! దాహంగా 'ఆహా' అంది కుళాయి.

నీళ్ళెక్కడ దొరుకుతాయి?

జంతికలు మసాల వడలు!

"నీళ్ళయ్యా"

"అదిగో అడ నుయ్యుంది"-మసాల వడలవాడి చికాకు సమాధానం

ఓ ఫర్లాంగుంది నుయ్యి. వెళ్ళొచ్చేదాకా రైలు ఆగుతుందా?

స్టేషన్లో రైల్వే ఉద్యోగులెవరూలేరు. గడియారం మాత్రంనిక్కచ్చిగా తిరుగుతోంది. దానికింకో పనిలేదు గనుక.మూడు కొట్టేదాకా ఆగాడు. స్టేషన్ పేరు చూశాడు. ఇక్కడ ఆగదే దాదర్. ఆగి గంట దాటిందన్న నిజం అప్పటికి మనసులో పైకితేలింది. నీళ్ళలో తాబేల్లాగా.

రైల్వే వాళ్ళని వారసగా నిలబెట్టికాల్చి పారెయ్యాలి-కడుపు కాలిన ఒక భారతీయుడి చేతకాని కసి.

భారతీయుడు తాటాకు చేదతో నీళ్ళుతోడి ఆ పేశం చల్లబరుమకున్నాడు

సవకలు-అన్నాడు. వెగటంతా పెదవుల్లో కేంద్రీకరించి

నీళ్ళుచేదాడు. తల ముఖం తడుపుకున్నాడు ఎండలో చల్లదనం సృష్టి మనిషి కిచ్చిన రెండోతరగతి సౌకర్యం మరో చేద. కడుపు నింపాడు. మరో చేదతో సీసా. సీసాకిదాహం తీరింది. తనకి తీరలేదు సీసా తాగేసి మరోసారి విండాడు.

స్టేషన్ ఆవరణలో చిన్నఇల్లు. గుమ్మంలో నిలబడి ఉన్నాడు స్టేషన్ మాష్టారు. అతని ఎదట ప్రయాణికులు. అతని కళ్ళల్లో భయం గొంతులో కోపంగా రూపొంది ఎండలా పేలింది.

ఏం చెయ్యమంటారు. ఇంజన్ డ్రైవరు అతని అనుచరులు దిగి వెళ్ళి పోయారు.

నన్నేం చెయ్యమంటారు వర్క్ టు రూల్సమ్మె. టెలిఫోన్ తీగలు కత్తి రించేశారు.

నన్నేం చెయ్యమంటారు?

నువ్వొచ్చి రైలునడుపు-ప్రయాణికుల తరుపున శ్రీముఖం.

నాకు చేతకాదే, నన్నేం చెయ్యమంటారు.?

తర్కవితర్కాలు వాదోపవాదాలు. స్టేషన్ మాష్టారు ఇంటి కాంపౌండ్ గోడ మీదనించి రెపరెప లాడింది అరిటాకు వేడి సుడిగాలి ఆకుని చీల్చి చెండాడింది. ఏం చెయ్యమంటారు? నన్నేం చెయ్యమంటారు?-అసహాయుని ఆర్తి.

ప్రజల అక్కసు అతని చొక్కా చింపేసింది! అతని కళ్ళలో లోతు తెలియని భయం ముక్కువెంట రక్తం కారి. కాలిన ఎర్ర కంకరలో ఇంకిపో యింది. తడి కంకర ఎర్రగా అతని చేతికంటుకుంది అలవాటుగా చేతినితెల్ల పంచె మీద ఎర్రగా తుడుచుకుంటూ లేచాడు

"ఏంచెయ్యమంటారు.?

"మీరుమనుషులు కారూ? ఒంటిగాణ్ణి చేసి కొడతారా?"

తలుపు తెరుచుకుని వేడిగాలి రివటలా వచ్చిన అసహాయుని అర్ధాంగి ఆవేశం కన్నీటితో కలిపి ప్రవహించింది.

"నాన్నా! నాన్నా!"

ముగ్గురు పిల్లల భయం అరిచింది.
మూడేళ్ళ పసివాడు అకస్మాత్తుగా మగవాడయాడు.

"పొండి-పొండి దొంగెదవల్లారా—"

చేతికందిన కంకరరాళ్ళు సవ్యచాచిలా రెండు చేతులా గుంపుమీద విసిరాడు.

గుంపు సిగ్గుపడింది. సరిగా తిక్లైనారాని పసివాడి అభియోగం ముందు తప్పు చెప్పుకున్న ముద్దాయిలా తలవంచుకుని వెనక్కి తగ్గింది.

తను అప్పుడు ధైర్యం చేసి ముందుకు వెళ్లాడు. సాటి రైల్వేఉద్యోగి సీసాలో చల్లని నీళ్ళు మళ్ళీకింద పడిపోయిన స్టేషన్ మాస్టర్ మీద జల్లాడు. స్వధర్మే నిధనం శ్రేయః.
చేయూత ఇచ్చి స్టేషన్ మాష్టార్ని లోపలికి తీసికెళ్ళాడు. మంచంమీద పడుకో బెట్టాడు. భర్త ముఖంలోని ఆశక్త కోపాన్ని చెంగుతో తుడుస్తూ భార్య అడిగింది.

"ఏ వూరు బాబూ?"

భారత భూమిలో ఒక వెనుకబడిన కుగ్రామమని చెపుదామనుకున్నాడు. పీడిత రైల్వే సేవకులలో క్రిందమెట్టుని ఆశ్రయించుకున్న ఒక మానవ కీటకాన్నని చెపుదామనుకున్నాడు.

"వాడి సెక్షన్‌లో.... దీ బుకింగ్ క్లార్క్!

"అలాగా బాబూ? సాటి రైల్వే వాళ్లుగనక....

చేతిలో మంచినీటి సీసా కంపార్ట్‌మెంటుల్ భార్య దాహాన్ని గుర్తు చేసింది. వాలుతున్న సూర్యుడు కసిగా కంట్లో చురుక్కుమన్నాడు. కళ్లలో ఎర్రకంకర నిప్పుసూదులు గుచ్చింది. జోళ్ళేకిమయాయి? నూతి దగ్గర మళ్ళీ సీసా నింపాడు.

పార్ట్‌మెంట్ నీడలోకి వచ్చేసరికి కళ్ళు వెలుగుకోసం వెతుక్కున్నాయి. గుడ్డిగా ఆప్యాయంగా. మూసిన కళ్ళు తెరిచి చూశాడు. కిటికీలో జీవసంచలనం లేదు. పెట్టిలోకి ఎక్కాడు దాహం కూడా మరచిపోయిన భార్య నోరు చీకటిగా తెరుచుకుని ఉంది. ఊపిరాడుతోందా? కొంపదీసి–గొంతులో నీళ్ళుపోశాడు.

రెండుగుటకలు దిగడం చూశాడు. "మద్రా సొచ్చిందా?"
మద్రా సెల్లాగొస్తుంది. మద్రా సొచ్చిందట మద్రాసు
"నాన్నా: ఆకలేత్తోంది."

మసాల వడలు జంతికలు కొనిపెట్టాడు చిట్టికి. సొంత కడుపు స్వార్థంతో గుల్లగా అరిచింది. ఒక మసాలవడ, ఒక జంతికా తిన్నాడు. రైలుపెట్టి ఉక్కులో కాలుతోంది. కిందికి దిగాడు ఎక్కడిదో చల్లగాలి రివట. ఆకుపచ్చగా దూరాన్నున్న చెట్టు పైకొమ్మల్ని ఊపింది. కిందికి ఎందుకు సాగిరాదు?

ఇంజన్‌దాకా నడిచాడు. లోపలికి చూశాడు. పొట్ట ఎర్రగా కణకణ లాడుతోంది. మంట లేదు. కాస్సేపుంటే ఆ బొగ్గులు కాలిపోతాయి. ఇంజిన్ చచ్చిపోతుంది.

పెళ్ళాం జబ్బు గుర్తుకొచ్చింది. ప్రాణం ఆరిపోతే మనిషి చచ్చి పోతాడు ఇంజన్ లాగే.

సికింద్రాబాదు రైల్వే ఆసుపత్రిలో కాన్సరేమో అన్నారు. మద్రాసు తీసికెడితే మంచిదన్నారు.

సార్ నా భార్యకి కాన్సరు. మద్రాసు తీసికెళ్ళాలి. డబ్బు-ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అడ్వాన్సుగా....

అప్లై

సార్, మద్రాసులో చికిత్సకయే ఖర్చులు-

చూస్తాం, మందుల బిల్సుకి ఫరవాలేదు, కన్సల్టేషన్ వగైరా వగైరా అంటే టెక్నికల్ అబ్జక్షనుంటుందేమో చూస్తాం.

వద్దు నాకేం వైద్యంవొద్దు ఫరవాలేదు అదే తగ్గిపోతుంది.

నీ మొహం.

కాదండీ, ఇప్పుడింతఖర్చు.... ఏ వెయ్యో అయిపోతుంది. భారత గృహిణి నిస్వార్థత కచ్చితంగా పలికింది.

నా జబ్బు కుదరాలి ఎంత ఖర్చైనా సరే- మద్రాసు వెళ్ళాలి. నేను చచ్చిపోను బతుకుతాను అనుకుంది ఆశగా ఆమెలోని మనస్సు.

స్వధర్మ శ్రేయం అదే నిర్వహించాలి. నా భార్యను నేను కాపాడు కోవాలి. ఎంతయినా సరే ఎంతవుతుంది మహా? ప్రావిడెంట్ ఫండ్‌లో ఒక వెయ్యి బాకీ పడుతుంది. అది చచ్చినాపూడదు. చావే ఖాయమైతే మద్రాసు దాకాఎందుకు? ఉన్నఊళ్లో అయితే వెయ్యి మిగులు. తీరామద్రాసులో అయితే....

తన ధర్మం తను చెయ్యాలిగదా. విటూర్పులో నిస్పృహ కాదు అసహాయత.

ఈ రైల్వే వాళ్ళకి బలే కొవ్వెక్కింది. సీటికి మాటికీ స్ట్రైకంట. తోలాలిచే వాడు లేక, కోట్లకొద్దీ అన్నం లేక సస్తాఉంటే ఈళ్ళకి పెచ్చు జీతాలు కావాలంట. ఆ ఇంజన్ డ్రైవర్ని మండుతున్న దాని కడుపులో కుక్కాలా? అసలు సర్కారోళ్ళకి బుద్ధిలేకులే స్ట్రైకనగానే పౌరసగా నిలబెట్టి కమ్చీపుచ్చుకు సితగ్గొడితే ఇట్టాబరితెగించే వోళ్ళేనా? రేప్పొద్దుగాల లగ్నం, మా రెండో వాడికి. ఈ రైలు కదలకపోతే లగ్నం ఆగిపోద్ది. యింతమంది జనాన్ని అవిధిపెట్టి వాళ్ళేం బాగుపడతారంట....

ప్రతీ ప్రయాణీకుడి గుండెలోనూ అక్కసు రగులుతోంది. రైల్వే సిబ్బంది మీద.

తనూ ప్రయాణికుడే. భార్యకి గడ్డుజబ్బు. ఇప్పుడే రావాలా ఈ స్ట్రైకు! భార్య కేదన్నా సంభవిస్తే తన గతేమిటి?

స్వధర్మే నిధనం శ్రేయః. కృష్ణ భగవానుడు తనకేం సలహా ఇచ్చేవాడో ఈ పరిస్థితిలో. అబ్బే ఈ రాజకీయ నాయకులను తలదన్నాడు. ప్రయాణికుల బలం ఇప్పుడు హెచ్చు. నువ్వు రైల్వే ఉద్యోగివని తెలిస్తే చితక తంతారు. అంచేత నోరు మూసుకుని ఊరుకో. చేతనైతే నాలుగు తిట్లు వాళ్లతో కలసి తిట్టు. నీ పెళ్ళాం ప్రమాదస్థితిలో ఉందని సాటి ప్రయాణికునికి తెలిస్తే వాళ్ళజాలి అవధికి మించి ప్రవహిస్తుంది. వీలైనన్ని సౌకర్యాలు నీకు ఏర్పాటుచేస్తారు.... అదుగో, రైల్వే ఉద్యోగిని నా ధర్మం సమ్మెను బలపరచడం-అని అసందర్భంగా వాదించకు. ప్రస్తుతం నువ్వు ప్రయాణికుడివి. సమ్మెవల్ల పీడితుడివి. నీ ధర్మం నేను చెప్పినట్లు చెయ్యడమే. అయినా పిచ్చోడా చేసేదీనువ్వుకాదు. దానిఫలం అనుభవించేదీనువ్వుకాదు. పనీ నువ్వుకాదు అసలు నువ్వే నువ్వుకాదు. అన్నీ నేనే అంచేత.

సూర్యుడు దిగులుగా పడమటి అంచుని మునిగిపోతున్నాడు. చల్లబడ్డ ఎర్రని బంతిలాగా. తన ధర్మం నెరవేర్చి వెళ్ళిపోతున్నాడు.

చిట్టి పరిగెత్తుకొచ్చింది అతన్ని వెతుక్కుంటూ.... అమ్మ .... అంది.

పరిగెత్తాలనుకుంది. కాళ్ళు సమ్మెచేశాయి రైలు చక్రాలంత బరువుగా

ఎక్కడి దా హోరు! తుఫానుకి చెట్లఆకులు మెల్లగా ఊగుతూ నవ్వాయి బిడియంగా. కన్నెపిల్ల బుగ్గల్లా రెమ్మలకొసలు ఎర్రబడ్డాయి. ఆరిపోతున్న సూర్యుని ఆఖరి కిరణాలుపడి.

అమ్మ పిలుస్తోంది.

అంతేగదా, తుఫాను హోరు చల్లబడింది. చటుకుని నిశ్శబ్దం. వెనక్కి తిరిగి చూశాడు. ఇంజన్‌లోంచి ముగ్గురు ప్రయాణికులు దిగారు. సాహసించి ఎక్కిన వాళ్ళు.

ఆ బిసలన్నీ మనకేం తెలుస్తాయిరా! ఇంజిన్ కదిలించామనుకో అది ఆపడం తెలీదే.

లైన్‌క్లియర్ లేకుండా నడిపితే ప్రమాదం. రైలు పట్టాలు తప్పుతుంది

మనోడు సీటావిరంతా వొదిలేశాడు. రైలెట్టా నడుస్తాది.

ఓహో ఆ హోరు స్టీమన్నమాట.

కాళ్ళు కదిలాయి. హుషారుగా.

భార్య ముఖంమీది చెమటలు తన జేబు రుమాలుతో తుడిచాడు. దాని దుర్వాసనకి ఆమె ముక్కుకోణాలు కాస్త ముడుచుకున్నాయి. పెట్టిలో కడచీకటి. కాని అతని మనస్సు కుమటపడింది.

గార్డు పెట్టెలో ఉంటుంది మెయిన్ స్విచ్చి.

దీపాలు వెలిగించడానికి తంటాలు పడుతున్న యువకుడుదిగాడు.

తనూ దిగాడు.

గార్డు పెట్టెముందు ఇసకేస్తే రాలకండా జనం.

యువకుడు స్విచ్చికోసం వెతికి వెతికి విరమించుకున్నాడు.

స్టేషన్‌మాష్టారు వచ్చాడు. భార్యా పిల్లలతో. వాళ్ళే అతని వెంట వచ్చారు. అతనికి ఏ అపాయం వస్తుందోనని స్టేషన్‌లో కిరసనాయిలు దీపాలు వెలిగించాడు. ఏ ప్లాట్‌ఫారం మరీ చీకటయిపోయింది చీకటంతా నేసమీద పేరుకుని.

తను గార్డు పెట్టెలోకి ఎక్కాడు స్విచ్చి వేశాడు. కొన్ని పెట్లలో లైట్లు తప్పున వెలిగాయి. ప్రయాణికుల మెచ్చుకోళ్ళు కాలిన వొంటిమీద చల్లగాలి రివటల్లా తగిలాయి అతని చెవులికి.

కిరసనాయిలు దీప స్తంభం కిందగుడ్డ పరుమకుని మూడుముక్కలాట ఆడుతున్న నలుగురు ప్రయాణికులు రైలు పెట్టె కిటికీలోంచి పడుతున్న వెలుగు చదరంలోకి కింద పరిచిన గుడ్డ జరిపి ఆట సాగించారు.

రైలోళ్ళు సమ్మెచేస్తే చావే-అత్రంలేని గొంతొకటి అంది.

సావేఁవుంది? ఇంటికాడ కూకుంటాం మా బామ్మరిది పెళ్లి కెళ్ళక్కర్లే.

కర్చు తగ్గుద్ది.

అది సరేనయ్యా. గుడ్సులు నడవకపోతే సరుకులు రవాణా ఎట్టాఅవుతియ్? వట్నాల్లో బియ్యం పణద్దారదొరకవ్

ఎలట్రీ మిల్లుకి బొగ్గొ.

యలంట్రీ మిల్లేంట్రోయ్?

అదేరా. ఈదీపాలకి యలంట్రీ సప్లయి సేస్త దే-అది.

అవన్నీ వాళ్ల సమస్యలు. అగిపోయిన రైల్లో ప్రమాదస్థితిలో ఉన్న రోగులేంకావాలి? ఆ సంగతి ఎవరికి అక్కర్లేదు అసలు 8 నించి సమ్మెఅన్న సాటిరైలు పనివాళ్లు అకస్మాత్తుగా ముందు ప్రారంభించడం ఏమిటి? బొత్తిగా వేళాకోళమైపోయింది.

మీ కోసం మీ భవిష్యత్తు కోసం మీ న్యాయమైన హక్కులకోసం మీ సబబైన కోర్కెలకోసం—మీరు పోరాడాలి అందరూ సమక్యం కావాలి.

సమ్మె జయప్రదం కావాలి. ప్రభుత్వం మీ పాదాక్రాంతం కావాలి-నాయకుడి ఉద్ఘాటన.

నాయకుడి కేం? ఎన్నైనా చెపుతాడు. ఢిల్లిలో ఏర్ కండిషన్ల గదిలో విస్కీ తాగుతూ ఎన్ని ఉద్ఘాటనలైనా చేస్తారు. విమానంలో ప్రయాణం చేస్తారు నాయకుడికేం? వా కష్టాలు అతనికి అర్థంకావు. ప్రభుత్వానికీ అర్థంకావు. ప్రజలకంతకన్న అర్థంకావు.

ప్రభుత్వానికి ప్రజలు శత్రువులు. ప్రజలకు కార్మికులు శత్రువులు కార్మికులకు ప్రభుత్వం శత్రువు. భార్య భర్తకు శత్రువు. ఇద్దరికీ బిడ్డలు శత్రువులు. మనిషికి బ్రతుకు శత్రువు.

రైలు పెట్టెల్లో దీపాలు క్రమంగా సన్నగిలిపోయాయి. బాటరీలలో శక్తి అయిపోతుంది.

ప్లాట్‌ఫారం చివర పెద్ద సమావేశం ఒక కుర్రప్రయాణికుడు రెచ్చగొడుతున్నాడు.ప్రయాణికుల్ని.

రైలు తగలబెట్టెయాలి., ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. రైల్వే కార్మికుకులు జులుం నశించాలి....

నిజంగా తగలబెడతారా? ఇంతమంది ప్రయాణికులకి కూర్చోడానికే చోటుండదే. అయినా రైలు తగలబెడితే ఏం లాభం? ప్రయాణికులు రైలు నడవాలని కోరుకోడం సహజం—రైలు తగలబెట్టాలట! అత్తమీద కోపం దుత్తమీద—

చీకటి; లోకం అంచులన్నీ కరిగి చిక్కటిముద్దగా చేరుకుపోయాయి. స్టేషన్లో కిరసనాయిలు దీపాలు చీకటిని సన్నగా పరచడానికి ప్రయత్నిస్తున్నాయి

వెలుగులేని కోలాహల వెయ్యిగొంతుల నీడ. ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంట్ తలుపు పగిలింది.

అదుగో గార్డు దొంగగాడిదా కొ–ఫస్టుక్లాసులో పడుకుని నిద్రపోతు న్నాడు. కొట్టు తన్ను. ఆగండి. పెట్టెలో అ దు గు పెడితేకాల్చేస్తా? ఏమిటీ దౌర్జన్యం! నేను ప్రయాణికుణ్ణే. నేను త్రివేంద్రం చేరుకోవాలి ఏంచేస్తాం? గార్డు ఏంచేస్తాడు?

నైట్ డ్రస్‌లో ఉన్న ఆసామీ చేతిలో నల్లని పిస్టల్ చీకట్లో మెరిసింది జనంవాదం. ఆసామీ హేతుబద్ధమైన తర్కం–పిస్టల్ అ ధి క సంఖ్యాకులకూ అల్ప సంఖ్యలకూ మధ్య ప్రతిష్టంభన తీసుకొచ్చింది. ఫస్టుక్లాసుకో ఏడుగురే– నైట్ వేర్ లో ఉన్న ఆసామీ, గార్డుతో కలిపి ప్లాట్ ఫారంమీద లెక్కలేని తలలు పిస్టల్‌మీద భయకోపాలను గొంతెత్తి ప్రదర్శించాయి. ఈ ప్రతిష్ఠనకు పర్యవసానం లేదని అతలలకూ తెలుసు పరిష్కారం లేదనికూడా.

స్టేషన్ బయట దీపాలకళ్లతో దారి వెతుక్కుంటూ లారీవచ్చి ఆగింది. బిలబిల దిగారు ఒక్క ఏ భైమంది. రైల్వే కార్మికులు తనఆప్తులు తనవారి పక్షం తన న్యాయమైన హక్కులకోసం వారు పోరాడుతున్నారు. లారీలోం పెద్ద బుట్టలు దింపారు. పెరుగుఅన్నం పొట్లాలున్నాయి. బుట్టల్లో వరసగాచి ప్రయాణికులు పంచిపెట్టారు.

సోదరులారా! మీకు కలిగిన ఇబ్బందికి మేమంతో విచారిస్తున్నాం.

ఈ గుడ్డి ప్ర భు త్వా ని కి కళ్లుతెరిపించడానికి మేమీపని చెయ్యక తప్పిందికాదు. ఈ ఒక్కరాత్రి ఓపికపట్టండి. మానాయకుణ్ణి ప్రభుత్వం విడుదల చెయ్యగానే–

పెరుగన్నం తిన్న విశ్వాసం. కొందరు ప్రయాణికుల ఆవేశం చల్ల బడింది. తను అరిచాడు–

నా పెళ్ళాం చావు బతుకులమీదుంది. ఆమె కేమన్నా ప్రమాదిస్తే ఎవరు బాధ్యులు? ఇక్కడ ఆమెనుచూసే వారెవరు!

బ్రదర్ మీకీ ఇబ్బంది కలిగినందుకు ఎంతో విచారిస్తున్నాం.

రైలు నడుపుతారా? లేదా?

ఆరుగంటలు సాగిందిగా సమ్మె ఇకచాలు.

ఇంజన్ డ్రైవరు! రా. ఎక్కు. ఎక్కుతావా లేదా!

సోదరులారా మా మనవి....

మా మనవి ఎవరితో చెప్పుకోమంటా?

పెరుగన్నం తిన్న విశ్వాసం ఆవేశం కిందపడి చితికిపోయింది. తన పెట్టిపేపునడిచాడు. లోపలికి ఎక్కాడు చిట్టి కిటికీలోంచి చీకట్లోకి చూస్తోంది?

అమ్మ తిందా పెరుగన్నం?

లేదు. తినలేదు.

ఏమే....ఏఏమేవు....

కుడిపాదు చెయ్యి కర్రలా కిందికి వాలలేక పోయింది. ముఖంమీద చెయ్యేశాడు. గడ్డకట్టన చల్లదనం విద్యుత్తులా తగిలింది. తనలో రైళ్ళు కళ్లలో చీకటి లంగలు మట్టుకుంది. తూలి పడిపోయి పడబోయి తలుపు పట్టుకున్నాడు. ఇంక ప్రయాణం ఆఖరయిపోయింది. తుదిమజిలి చేరుకుంది. ప్లాట్‌ఫారం మీదికి దిగాడు.

చిట్టి కళ్ళు ప్రాణంతో మెరిసాయి కిటికీలో. చావుకీ నిద్రకీ తేడా తెలియని అమాయకత్వంతో.

ఎటో తెలీకండా నడిచాడు.

ఫస్టుక్లాసు కిటికీలోంచి నైట్ పేర్‌లో ఉన్న అసామి కనిపించాడు.

హలో గార్డు, ఫిష్‌ప్లేట్ కొన్నాడు. ఫలానా స్టేషన్లో రుచి చూడండి.

థాంక్స్

ప్లేట్ దానికింద బుట్టలో ఉంది.

ఫిష్-ప్లేట్.

ఇంజిన్ దగ్గర ప్రయాణికులు ఎదురు తిరిగారు. పెరుగన్నం విశ్వాసం చీకట్లో కలిసిపోయింది. ఇంజిన్ డ్రైవర్ని పట్టుకున్నారు. నలుగురు.

రైలు నడుపుతావా. ఇంజిన్ పొయ్యిలో కుక్కమన్నావా?-జనం శ్రీముఖం.

సోదరులారా! పెరుగన్నం పంచిన అసామి ఆర్తి.

కేకలు-చీకటి లుంగలు చుట్టుకుని గింగురు మంటోంది. ఇంజన్ డ్రైవరు కళ్ళుభయంతో వెలిగాయి. ప్రాణభయంతో ఇంజిన్‌లోకి ఎక్కాడు. ఇద్దరు అనుచరులు ఎక్కారు. ఇంజిన్ పొయ్యిలో బొగ్గువేశారు.

ఆవేశం కట్టలు త్రెంచుకుంది. స్వధర్మే నిధనం శ్రేయః అరిచారు ప్రాణాలు పోయినా సరే, మన హక్కుల కోసం మనం పోరాడాలి. ఫిష్ ప్లేట్ గుర్తుకొచ్చింది.

రండి రైలునడవడానికి వీల్లేదు. మనన్యాయమైన కోరికలు ప్రభుత్వం తీర్చేవరకూ ఈ రైలు నడవడానికివీల్లేదురండి.

రైలు కట్టవెంట ఒంటరిగా ముందుకు నడిచాడు. అతని ఆవేశం రైల్వే పనివాళ్ళు ఉత్సాహం రేకెత్తింది. ఇంకాతేరుకోని ప్రయాణికుల్ని ఇంజన్ ప్రక్క చీకట్లో వొదిలేసి ముందికి కదిలాడు. ఫిష్ ప్లేట్లు మాయమైపోయాయి. రెండు రైలు పట్టాలు కట్టపక్కకి దొర్లిపోయాయి. రైలు ఇంక కదలదు. అదిచచ్చిన శవం.

స్వధర్మే నిధనం శ్రేయః.

(తరుణ; ఆగస్టు 1974)